క్లుప్తంగా

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం



ప్రతిష్ఠకు సిద్ధమైన విగ్రహాలు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురులో నిర్మిస్తున్న శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొన్ని శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. విగ్రహాలకు పలు ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. హోమాలు నిర్వహించారు. మల్లిడి వెంకటరెడ్డి పుష్పావతి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్

అనపర్తి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా సంక్షేమాన్ని విస్మరించకుండా, అన్ని రంగాలకు కేటాయింపులు చేశారని తెలిపారు. పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు అండగా ఉండేలా పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు.

నేడు మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో కొలువైన ఉన్న మహాలక్ష్మీ అమ్మవారి నూతన విగ్ర హా ప్రతిష్ఠ కార్య క్రమం శనివారం నిర్వహిస్తామని ఆల యం కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు.

నేడు కాపవరంలో డ్రోన్ సర్వే

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలో శనివారం డ్రోన్‌తో భూసర్వే జరుగుతుందని తహసీల్దార్ పాపారావు తెలిపారు. శుక్రవారం చేయాల్సిన ఈ సర్వే వర్షం కారణంగా నిలిచిపోయిందన్నారు. దీంతో శనివారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భూరీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. గాడాలలో ఈ కార్యక్రమం పూర్తయ్యిందని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 39 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ పరీక్షల్లో శుక్రవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిషు పేపర్–1 పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 291 మంది హాజరు కావాల్సి ఉండగా 274 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 290 మంది హాజరు కావాల్సి ఉండగా 271 మంది, ఒకేషనల్‌కు మొత్తం 13 మందికి 10 మంది హాజరయ్యారు. మొత్తం 39 మంది గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కేవీ రామకృష్ణ, సీహెచ్‌ఏ శిరీష తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్ వి.సుబ్రహ్మణ్యం, ఎంవీఎస్ కృష్ణ తనిఖీ చేశారు.

కోరుకొండలో 34 మంది..

మధురపూడి: కోరుకొండ రాజుబాబు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిషు పరీక్ష జరిగింది. జనరల్ ఇంగ్లిషుకు 27 మంది, ఒకేషనల్ ఇంగ్లిషుకు 7 మంది విద్యార్థులు హాజరుకాలేదని ప్రిన్సిపాల్ రామచంద్రరావు తెలిపారు. జనరల్ 405, ఒకేషనల్ 99 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాన్ని డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు తదితరులు పరిశీలించారు.

26 నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో మంచినీటి చెరువు వద్ద కొలువై ఉన్న గోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఏడవ వార్షికోత్సవం ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభంకానున్నట్టు మండల విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయ ధర్మకర్త సిద్ధాంతపు సత్తిబాబు చేతులమీదుగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయం వద్ద ఈ నెల 31 వరకు వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం, జీవిత చరిత్ర, హరికథ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. దార్ల అమ్మిరాజు, దవరసింగ్ వెంకటరమణ, కొత్తుర్తి సత్తిబాబు, గరగడాల నాగేంద్రబాబు, ర్యాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో జరుగుతున్న ఒనువులమ్మ ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉత్సవమూర్తుల గ్రామ ప్రదక్షిణం వేడుకగా జరిగింది. ఉదయం ఉత్సవ మూర్తులకు వాస్తు పూజ, క్షీరాభిషేకం నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. శనివారం ఉదయం 10.18 గంటలకు అమ్మవారి నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం భారీ అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ప్రకృతి సాగు.. భూసారం బాగు

- ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- డ్వాక్రా మహిళలకు విత్తనాల విక్రయ బాధ్యతలు

బిక్కవోలు: ఎరువులు, పురుగు మందుల వినియోగం లేకుండా జీరో కాస్ట్, ప్రకృతి విధానంలో సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ విధానంలో నవధాన్యాలను పచ్చిరొట్ట తరహాలో భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరిగి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించవచ్చు. నవధాన్యాల విత్తనాలను డ్వాకా గ్రూపు మహిళల ద్వారా రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో సాగు విస్తరణ పెరగడంతో పాటు డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడనుంది. ప్రకృతి విధానం సాగులో రైతులు తాము పండించిన పంట వారం

విత్తనాలు	రకాలు
చిరుధాన్యాలు	జొన్నలు, కొర్రలు, రాగులు, సజ్జలు
పప్పు దినుసులు	పెసర్లు, మినుములు, ఉలవలు, శనగలు, బొబ్బర్లు
నూనె దినుసులు	నువ్వులు, పొద్దు తిరుగుడు, ఆముదం
పచ్చిరొట్ట ఎరువు	కట్టెజనుము, పిల్లి పెసర, జీలుగు
సుగంధ ద్రవ్యాలు	ఆవాలు, ధనియాలు, మెంతులు
కూరగాయలు	బెండ, గోరు చిక్కుడు, బీన్స్
తీగజాతి	దొసకాయ, బీర, ఆనప (లేక) సొర,
ఆకు జాతి	తోటకూర, గోంగూర, పాలకూర
దుంపజాతి	ముల్లంగి, క్యారట్
పూలజాతి	బంతి



గత ఏడాది వేసిన నవధ్యానాల పంట



నవధాన్యాల విత్తనాలు

రోజుల్లో కోతకు వస్తుందనగా నవధ్యానాల విత్తనాలను చల్లుకోవాలి. వారం రోజుల్లో విత్తనాలు మొక్క దశకు చేరుకుంటాయి. 35 నుంచి 40 రోజులలో పూర్తి స్థాయిలో ఎదుగుతాయి. వీటిల్లోనే పశువులను మేపుకోగా మిగిలిన దానిని దుక్కిలో దున్ని వారం రోజుల పాటు ఉంచుతారు. ఇలా చేయండ వల్ల 50 శాతానికి పైగా పోషకాలు భూమికి అందుతాయి. దీని వల్ల ఎరువులు, పురుగు మందుల వినియోగం 50 శాతానికి పైగా తగ్గుతుంది. ఇలా చేయడం వల్ల పంటకు చీడపీడలు కూడా ఆశించవు, పంట కూడా ఆరోగ్యంగా పెరుగుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌ల ద్వారా తయారీ

అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా నవ ధాన్యాల ప్యాకెట్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. 13 కిలోల ప్యాకెట్‌ను రూ.వెయ్యికి విక్రయిన్నారు. ఇలా తయారు చేసేందుకు ఈ గ్రూప్‌లకు బ్యాంకు లింకేజ్ ద్వారా రుణ సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఒక్కొక్క గ్రూపునకు రూ.50వేలు అందిస్తున్నారు. దీని ద్వారా ఎస్‌హెచ్‌జీలకు కొంత ఆదాయం వస్తోంది.

క్షేత్ర స్థాయిలో విస్తరణకు కృషి

ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఈ కార్యక్రమాన్ని దశల వారీగా పెంచడానికి గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నవ ధాన్యాలను దుక్కిలో వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన గడప గడపకు నవధాన్యాల సారథులు అవగాహన కల్పిస్తారు.

గ్రామంలోని సాగు విస్తీర్ణం, రైతులు ఎంత మంది ఉన్నారు వంటి వివరాలతో ఆయా రైతుల ఇళ్లకు వెళ్లి వివరిస్తారు. రైతుల వద్ద నుంచి రాష్ట్ర ప్రభుత్వం నవధాన్యాల విత్తనాలు సేకరిస్తుంది. ఇలా సేకరించిన విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి రైతులకు సరఫరా చేస్తుంది. ఇప్పటికే వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ విభాగాల

నియోజకవర్గంలో...

మండలం	ఎస్ఎఫ్ రైతులు	గతేడాది (ఎకరాల్లో..)	ఈ ఏడాది
అనపర్తి	425	307	435
బిక్కవోలు	1,766	1,390	3,248
రంగంపేట	349	300	463
పెదపూడి	196	206	350
మొత్తం	2,736	2,203	4,496

ప్రయోజనాలపై క్షేత్ర స్థాయిలో పరిశోధనలు నిర్వహించారు. తద్వారా ప్రకృతి సాగును క్షేత్రస్థాయిలో విస్తరిస్తున్నారు. అనపర్తి నియోజకవర్గంలో సేంద్రియ వ్యవసాయ చేసే రైతులు 2,736 మందిలో 2022 ఏడాదిలో నవధ్యానాలు 2.203 ఎకరాల్లో వేశారు. ఈ ఏడాది 4,496 ఎకరాలు లక్ష్యంగా పనిచేస్తున్నారు.

ఆర్థిక పరిపుష్టి



నవధాన్యాల విత్తనాల ప్యాకెట్లు విక్రయించడం ద్వారా ప్రకృతిసాగును ప్రోత్సహించడంతో పాటు సంఘ సభ్యులు ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు. ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించాం. ప్రకృతి సాగుకు కృషి చేస్తున్నాం.

– బందారు సంధ్యాదేవి, సేంద్రియ వ్యవసాయ ఐసీఆర్‌పీ, కొప్పవరం

భావితరాల ఆరోగ్యం కాపాడవచ్చు



సేంద్రియ వ్యవసాయ చేయడంతో నవధాన్యాలు పంట పొలాల్లో వేయడం వల్ల భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. దీనివల్ల సాగు ఖర్చులు తగ్గుతాయి. భావితరాల ఆరోగాన్ని కాపాడవచ్చు.

– వల్లి, సేంద్రియ వ్యవసాయ అసిస్టెంట్ డీపీఎం, రాజమహేంద్రవరం

ఆటో డ్రైవర్ నిజాయితీ



ప్రయాణికురాలికి పర్సును అందజేస్తున్న ఆటోడ్రైవర్ రాజు

రాజానగరం: ఓ ప్రయాణికురాలు తన ఆటోలో మరిచిపోయిన పర్సును డ్రైవర్ జాగ్రత్తగా ఆమెకు అప్పగించాడు. దివాన్‌చెరువులో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలు.. శ్రీకృష్ణపట్నానికి చెందిన ఒక మహిళ దివాన్‌చెరువు సెంటర్‌లో రాజమహేంద్రవరం వెళ్లేందుకు అక్కడ ఉన్న ఆటో ఎక్కింది. ఇంతలో ఆర్టీసీ బస్సు రావడంతో కంగారుగా ఆటో దిగి, బస్సులో ఎక్కేందుకు పరుగు తీసింది. ఈ సమయంలో క్లాత్ చుట్టి ఉన్న పర్సును ఆటో మరిచిపోయింది. కొద్దిసేపటి తరువాత ఆ పర్సును ఆటో డ్రైవర్ జలగం రాజు గుర్తించాడు. వెంటనే ఆటో యూనియన్ అధ్యక్షుడు దాసరి శ్రీనుకు విషయాన్ని తెలియజేశాడు. అప్పటికే ఆమె పోగొట్టుకున్న పర్సు కోసం దివాన్‌చెరువు సెంటరుకు వచ్చి వెతుకుతోంది. దీంతో శ్రీను ఆమెకు పర్సును భద్రంగా అందించాడు. ఆ పర్సులో బంగారు చెవిదుద్దులతో పాటు కొంత నగదు కూడా ఉంది. నిజాయితీగా పర్సును అందజేసిన ఆటోడ్రైవర్‌ను రాజును సెంటర్‌లోని వ్యాపారులు, ప్రయాణికులు అభినందించారు.

ఘనంగా గోలింగేశ్వరస్వామి కల్యాణం



కల్యాణ కాంతులతో స్వామి అమ్మవార్లు

బిక్కవోలు: స్థానిక శ్రీ ఉమా పార్వతీ సమేత గోలింగేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకులు కొడమంచిలి సత్యనారాయణ శర్మ, సన్నిదిరాజు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, కుమార్తెలను చేశారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ మంటపారాధన, హోమం నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సం నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణం చేశారు. ఈవో రామలింగ భాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, బిక్కవోలు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం కమిటీ చైర్మన్ తమ్మినేని నాగశ్రీనువాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ విక్టర్ బాబు

పెదపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లో గల చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి ఆ గ్రామ సచివాలయాలకు అదనపు ఆదాయం పెంచడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్‌బాబు అన్నారు. పెద్దాడ గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రాల వద్ద వివిధ రకాల పండ్ల మొక్కలు, కొబ్బరి, అరటి, బీర, ఆనప కూరలు పండించి సచివాలయానికి ఆదాయం పెంచాలన్నారు. నిబంధనల ప్రకారం వర్మీ కంపోస్టు ఎరువు రైతులకు విక్రయించాలన్నారు. వీధిలైట్లు పగటి సమయంలో వెలగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కుక్కల నియంత్రణకు వాటిని పట్టుకుని పిల్లల పుట్టకుండా నియంత్రణ ఆపరేన్లు చేయించాలన్నారు. స్వమిత్వా గ్రామాల్లో రీసర్వే చేయాలన్నారు. ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి, సర్పంచ్ డొకుబుర్ర మీనాక్షి, కార్యదర్శులు త్రినాథ్, అచ్చిరాజు, డొకుబుర్ర కృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయానికి సీఎం జగన్ ప్రాధాన్యం

- ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు
- జగన్నాథపురంలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



జగన్నాథపురంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు

మధురపూడి: వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి జగన్ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని, శనగలు క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధర 5,335 ప్రకటించడం హర్షణీయమని రాజానగరం నియోజకవర్గం ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు అన్నారు. కోరుకొండ మండలం జగన్నాథపురం ఆర్బీకేలో శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనగలకు ప్రైవేటు మార్కెట్‌లో కేవలం రూ.4,400 మాత్రమే ధర ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రంగంపేట మండలం వడిశలేరుకు 30 కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వచ్చేదన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఈ సమస్యను గుర్తించిన రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కొనుగోలు కేంద్రాన్ని కోరుకొండ మండలానికి మార్చారని తెలిపారు. తొలుత స్థానిక బూరుగుపూడిలో కొనుగోలు చేసినప్పటికీ, ఈ సంవత్సరం పంట పండించిన రైతు ముంగిటకు తీసుకొచ్చారన్నారు. ఏ గ్రామానికి ఆగ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయడం సంతోషకరమైన విషయమన్నారు. ఎమ్మెల్యే రాజా కృషి వల్లే ఇలా జరిగిందన్నారు. ఈ సందర్భంగా కొనుగోలు మిషన్ ద్వారా శనగలను కొన్నారు. కార్యక్రమంలో బూరుగుపూడి పీఏసీఎస్ చైర్మన్ బుడ్డిగ సత్యనారాయణ, వ్యవసాయశాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, కోరుకొండ మండలాధికారి ఏ.గౌరీదేవి, జగన్నాథపురం ఉపసర్పంచ్ వంకా రాజు, మాజీ సర్పంచ్ మట్టా పెద్ద వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ తుమ్మల వెంకట రమణ, ఆర్బీకే చైర్మన్ దిడ్డి శ్రీకాంత్, బూరుగుపూడి సొసైటీ సీఈఓ ఈదల సుదర్శనరావు పాల్గొన్నారు.

ఎద్దులను, ఆవులను తరలిస్తున్న నలుగురి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రెండు వాహనాల్లో ఎద్దులు, ఆవులను తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. దివాన్‌చెరువు జీరోపాయింట్ వద్ద ఎస్సై జగన్‌మోహన్, సిబ్బందితో కలిసి శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా రెండు వాహనాల్లో విజయనగరం నుంచి గుంటూరు తరలిస్తున్న తొమ్మిది ఎద్దులు, నాలుగు ఆవులను గుర్తించారు. ఆ వాహనాలకు ఎటువంటి పత్రాలు లేకపోవడంతో నలుగురిని అరెస్టు చేశారు. ఎద్దులను, ఆవులను సంరక్షణ కోసం గోకవరంలోని గోశాలకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని రాపాకకు చెందిన మార్పు బాలకృష్ణ (24) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై కె.శుభశేఖర్ శుక్రవారం తెలిపారు. వివాహితుడైన బాలకృష్ణ కుటుంబ కలహాలతో గురువారం మధ్యాహ్నం పొలంలో పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని సీతానగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి, అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా గురువారం అర్ధరాత్రి 12.15 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

21న మోత వెంకట్రావు వర్ధంతి సభ

గోకవరం: రాజమహేంద్రవరంలోని విక్రమ్ హాలులో ఈ నెల 21న నిర్వహించే ఏఐఎఫ్‌టీయూ ఉభయ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి మోత వెంకట్రావు వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. మండలంలోని రంపయర్రంపాలెంలో శుక్రవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులు, చట్టాలు, పేద ప్రజల కోసం మోత వెంకట్రావు పని చేశారన్నారు. 21న నిర్వహించే ఆయన వర్ధంతి సభలో సంఘం నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సొసైటీ సమావేశం

పెదపూడి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ మార్ని కామరాజు చౌదరి అధ్యక్షతన సొసైటీలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సొసైటీ ప్రగతిని సీఈఓ ఎం.దుర్గారావు వివరించారు. కామరాజు చౌదరి మాట్లాడుతూ సొసైటీలో రూ.11కోట్ల50లక్షలు టర్నోవర్ జరుగుతోందన్నారు. డైరెక్టర్లు తొటకూర వెంకట్రావు, పందిరి సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ



నిందితుడు కృష్ణ భాస్కర్‌ను విచారణ చేస్తున్న డీఎల్‌డీఓ వీణాదేవి, ఎంపీడీఓ నరేష్‌కుమార్

మధురపూడి: కోరుకొండ మండలం జగన్నాథపురం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న క్రొవ్విడి కృష్ణ భాస్కర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై పంచాయతీరాజ్ శాఖ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) పి.వీణాదేవి శుక్రవారం విచారణ నిర్వహించారు. తొలుత రికార్డులు, నిందితుడు చూపుతున్న చలానాలను పరిశీలించారు. అలాగే స్థానిక సిబ్బంది నుంచి సమాచారం తీసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని, నివేదికను కలెక్టర్ మాధవీలతకు అందజేస్తామన్నారు. ఎంపీడీఓ ఫిర్యాదు ప్రకారం సచివాలయంలోని డీఏ కృష్ణభాస్కర్ సర్వీస్ రిక్వెస్ట్ అమౌంట్ రూ.1,50,000 చెల్లింపులు చేయకుండా (స్వాహా చేసినట్టు) అవకతవకలకు పాల్పడినట్టు తెలిపారు. వివిధ చెల్లింపుల ద్వారా వచ్చిన నగదు ఏపీ సేవా పోర్టల్ 2.0లో జమ కాలేదన్నారు. 2022 జనవరి నుంచి ఈ సంవత్సరం ఫిబ్రవరి 16 వ తేదీ వరకూ 66 చలానాలు జరిగినప్పటికీ నగదు జమకాలేకపోవడం శోచనీయమన్నారు. కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు నిరసన

గోకవరం: తన ఆధీనంలో ఉన్న భూమిని వేరే వ్యక్తుల రికార్డుల్లోకి ఎక్కించారంటూ రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన రైతు సత్యం గంగాధర్ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపాడు. వివరాల్లోకి వెళితే.. రైతు గంగాధర్ వారి కుటుంబ సభ్యులకు చెందిన కొంత భూమిని కొద్ది సంవత్సరాల క్రితం వేరే వారికి అమ్మారు. అమ్మగా మిగిలిన భూమి వీరు ఆధీనంలో ఉన్నప్పటికీ రీ సర్వేలో వేరే వారి పేరుపై వచ్చిందని ఆరోపిస్తూ నిరసన తెలిపాడు. విషయం తెలుసుకున్న ఆ గ్రామానికి చెందిన స్థానిక నాయకులు ఆయనతో చర్చలు జరపగా నిరసన విరమించాడు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా భూమి పత్రాల ఆధారంగానే రికార్డు మంజూరు చేసినట్టు చెప్పారు.

వాహనాలకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని సెబ్ స్టేషన్‌లోని 41 వాహనాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. 36 వాహనాలను రూ.1,85,300కు పాడుకున్నారు. మరో ఐదు మిగిలిపోయాయి. సెబ్ రాజమహేంద్రవరం అదనపు ఎస్పీ పి.సోమశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

కనీస వేతనాలు అమలు చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెదపూడి: పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సంఘం మండల ప్రతినిధి బి.ఏసుబాబు అన్నారు. పెదపూడి గ్రామంలో అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఏసుబాబు మాట్లాడుతూ కార్మికులు ఐక్యతతో ముందుకు సాగుతూ తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్ మాట్లాడుతూ ఈ నెల 21న కామ్రేడ్ మోతా వెంకట్రావు నాలుగో వర్ధంతి రాజమహేంద్రవరంలోని విక్రమ హాల్‌లో నిర్వహిస్తున్నారన్నారు. ఆ కార్యక్రమానికి కార్మికులు హాజరుకావాలన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్మికులు సత్తిబాబు, ఆనంద్, అనంతలక్ష్మి పాల్గొన్నారు.